ట్రాఫిక్ వలయంలో భీమవరం


రోడ్డుపైనే నిలిపి ఉంచిన వాహనాలు


రోడ్డుపై పార్కింగ్ చేసిన కారు


ప్రభుత్వాసుపత్రి రోడ్డులో రోడ్డుపై పడుకున్న ఆవులు

- ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న జిల్లా కేంద్రం
- నియంత్రణకు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

భీమవరం: జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలోని రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రత్యేంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వాహన యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ మరింత జఠిలమవుతుంది. విద్యా, వ్యాపార, వైద్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో పెద్ద పెద్ద షాపులు, కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రధాన రహదారి వెంబడి ఉండడంతో సరుకుల ఎగుమతి, దిగుమతులు, విద్యా సంస్థల వాహనాలు రోడ్ల పైనే పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమవుతుంది. పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్లడంతో నిత్యం ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుంటాయి. వీటికి తోడు వందలాది ప్రైవేట్ విద్యా సంస్థల వాహనాలు జాతీయ రహదారిపైనే ప్రయాణిస్తాయి.

● జిల్లా కేంద్రం కావడంతో పెరిగిన రద్దీ

భీమవరం పట్టణం జిల్లా కేంద్రంగా అవతరించడంతో గత రెండేళ్లుగా వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రైవేట్ వాహనాలతోపాటు, ప్రభుత్వ వాహనాలు నిత్యం ప్రయాణిస్తుండడంతో చిన్న చిన్న రోడ్లు సైతం నిత్యం రద్దీగా మారుతున్నాయి. ఇటువంటి తరుణంలో ట్రాక్టర్లు, లారీలను పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నప్పటికీ పట్టణంలోని పెద్దపెద్ద షోరూమ్స్, కిరాణా, ఎలక్ట్రికల్, సిమెంట్, ఐరన్ వంటి షాపులు పట్టణంలోనే ఉండడంతో వాటి ఎగుమతి, దిగుమతులకు వచ్చే వాహనాలను రోడ్లపైనే నిలిపి కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీంతో అసలే ఇరుకు రోడ్లతో ఇబ్బంది పడే ప్రయాణికులు, ప్రజలు వాహనాల నిలుపుదలతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● రోడ్లపై ఆవులతోనూ ఇబ్బందులు

పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులు ట్రాఫిక్ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. పెద్ద సంఖ్యలో ఆవులు ప్రధాన రోడ్లపై సైతం సంచరించడంతో వాహనాలను తప్పించడానికి ఇబ్బందులు ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఆవుల యజమానులు వాటిని కట్టడి చేయకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తున్నాయి. అంతే కాకుండా రోడ్డుకు అడ్డుగా పడుకోవడంతో వాహదారులు పొరపాటున వాటిని ఢీ కొట్టడం, కాళ్లపై నుంచి వెళ్లడంతో వాటికి గాయాలవుతున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న దాఖాలు కన్పించడం లేదు.

● ట్రాఫిక్ పోలీసుల చర్యలు శూన్యం

ప్రధాన రోడ్లపైనే వాహనాలను నిలిపి వస్తువులు, ఫర్నిచర్ వంటివి ఎగుమతి, దిగుమతి చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతే కాకుండా షాపులకు ఎదురుగా రోడ్డుపై మోటారు సైకిల్స్ పార్కింగ్, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద రోడ్డు పైనే ఆటోలు నిలిపి ఉంచడం వంటి చర్యలతో ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని, ఆవులను కట్టడి చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

అమ్మవార్లను దర్శించుకున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ


అమ్మవార్లను దర్శించుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో కొలువైయున్న శ్రీ పర్లమ్మ, ముత్యాలమ్మ, గౌరమ్మలను సోమవారం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం


అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో, సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ముందుగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్ర పటానికి కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింహరాజు మాట్లాడుతూ అబుల్ కలాంఆజాద్ భారత ప్రభుత్వ తొలివిద్యాశాఖామంత్రిగా పని చేయడమేగాక అనేక భాషల్లో ప్రావీణ్యం పొందారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్, అధ్యాపకులు జీజీ రత్నం, రవిచంద్ర వి.ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సేవలు మరువలేనివి


ఉండి పెదపేట ఎంపీపీ స్కూల్‌కి ఫెన్సింగ్ వేయించిన దృశ్యం

ఉండి: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాతలు సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఉండి పెదపేటకు చెందిన చిట్టూరి శాంసన్ తన భార్య ఇందిర జ్ఞాపకార్థం పాఠశాల గ్రౌండ్‌లో ఇసుక మట్టి, ఐరన్ ఫెన్సింగ్ వేయించాడు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కలిదిండి బంగారమ్మ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం


దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ పద్మావతి, వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని లక్షదీపోత్సవం నిర్వహించారు. కేంద్ర సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవం ప్రారంభించారు. కాలనీవాసులు దీపోత్సవంలో పాల్గొని కార్తీక దీపారాధన నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంతేటి వెంకటరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పాలకొల్లు అర్బన్: బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ విభాగం జిల్లా అధికారి బి.నెహమ్యా అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దత్తత మాసోత్సవాల్లో భాగంగా బాలల సంరక్షణ చట్టాలు, బాలల చట్టాలపై అవగాహన, బాలల జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు తదితర అంశాలపై బాలలకు అవగాహన కల్పించారు. హెచ్ఎం పి.మూర్తి మాట్లాడుతూ బాలబాలికలకు రక్షణ కోసం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 14ఏళ్ల లోపు పిల్లలు పనులు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బడి ఈడు పిల్లలను పనులు చేస్తుంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.విజయకుమారి, కె.సత్యశ్రీ, జీవీ కుమారి, కుసుమే రాణి, కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, సోషల్ వర్కర్ కె.స్వర్ణలత పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

భీమవరం: వీఆర్వోలు గ్రామ స్థాయిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వోను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, మిరియాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో సీసీఎల్ఏ అధికారులు ఇచ్చిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు సంబంధం లేని ఇతర శాఖల విధులను వీఆర్వోలకు కేటాయించొద్దని ఇచ్చిన ఆదేశాలను గ్రామ స్థాయిలో అమలు చేయాలని కోరారు. వీఆర్వోల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డీఆర్‌వో హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మళ్ల జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కెనడీ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.పెంటయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టరేట్ వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తాము గెలిస్తే ఇసుక పాలసీ మారుస్తామని అందరికి ఉచితంగా ఇసుక ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు గడుస్తున్నా ఇసుక సమస్యను తీర్చలేక పోతున్నారన్నారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక విషయంలో ప్రైవేట్ వ్యక్తులు, మాఫియా ప్రమేయం లేకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇసుక సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి ఏడిద వాసు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మైలవరపు రాంబాబు, చెల్లబోయిన రంగారావు, కార్మికులు పాల్గొన్నారు.

మానసిక వికాస కేంద్రం సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: పట్టణంలోని బలుసుమూడిలో శ్రీవేంకటేశ్వర బధిరుల పాఠశాల, జువ్వలపాలెం రోడ్డులోని సెంటర్ ఫర్ విజువల్ ఛాలెంజ్డ్ హోమ్, పెదఅమిరంలోని అరుణోదయ మానసిక వికాస కేంద్రాన్ని సోమవారం భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ ఎంఎ సోమశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి వైద్య సదుపాయాలు అవసరమో అడిగి తెలుసుకున్నారు. అలాగే నిత్యం వైద్యులు వస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల్లో సమస్యలను నిర్వహకులు న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎన్.సుధీర్, బి.సురేష్ కుమార్, కె.జ్యోతి, డి.రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్

భీమవరం అర్బన్: మహిళలు, పిల్లలు, దళితులు, మైనార్టీలపై దాడులు, అత్యాచారాలు చేసి హత్యలు చేయడం వంటివి అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని వెంప, పెదగరువు, చినగరువు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా పోరు ప్రచార యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకి మహిళలు, దళితులు, పిల్లలు, మైనారిటీలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 15న ప్రజా సమస్యలపై జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తామని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మందా మార్తమ్మ, భూపతి శ్యామ్యేయేలు, తోటి శుభాకర్, వేగు మోహన్‌రావు,వర్ధనపు చిన్ని, కన్నమ్మ దాసు, ఇంజేటి ధనలక్ష్మి, దీపాటి పెద్దిరాజు, మేసరపు ప్రసన్న, కాటిక వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఆకివీడు: విద్యార్థులు ఇష్టంగా చదివి, ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు పిలుపునిచ్చారు. భారత తొలి విద్యా శాఖా మంత్రి స్వర్గీయ మౌలానా అబ్దుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని లయన్స్ కార్యాలయంలో సోమవారం నిర్వంచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మూడు ప్రవేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏ.రవీంద్ర, లయన్స్ ప్రతినిధులు సీహెచ్. కృష్ణంరాజు, వీవీ.కృష్ణంరాజు, గుర్రం శ్రీను, సన్నిధి వెంకన్న, మూర్తిరాజు, కె.నర్శింహం, తదితరులు పాల్గొన్నారు. క్విజ్ మాస్టర్లుగా హెచ్ఎం తోట పోతరాజు, విశ్రాంతి హెచ్ఎం రాజేశ్వరి, అరవింద్, బీ.ప్రభావతి,రెడ్డి లక్ష్మి వ్యవహరించారు.

వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి


తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: వరదల్లో ముంపుకు గురైన బాధితులకు తక్షణం సహాయం అందజేయాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బీవీ.వర్మ డిమాండ్ చేశారు. స్థానిక సమతానగర్‌లోని వరద బాధితులతో కలిసి సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ రెండు నెలల క్రితం వచ్చిన వరదలకు ఆకివీడు ప్రాంతంలో వందలాది మంది నష్టానికి గురయ్యారన్నారు. అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. బాధితులకు ప్రభుత్వ అధికారులు పునరావాసం కల్పించారని చెప్పారు. 53 రోజుల పాట పునరావాస కేంద్రంలో ఉన్న బాధితుల పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. పరిహారం అందని పేదలందరికీ తక్షణమే మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లతామని బాధితులకు వివరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బీ.రాంబాబు, ఎస్.సూరిబాబు, బాధితులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన


దొడ్డనపూడి గ్రామంలో నగర సంకీర్తన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

కాళ్ల: అయ్యప్ప స్వాముల నగరసంకీర్తన కార్యక్రమం మండలంలోని దొడ్డనపూడిలో సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన గురుస్వామి రాము ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు నగర సంకీర్తన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం దశమి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి ఊరేగింపుగా సుమారు 120 మంది అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలధారులు భక్తి, భజనలతో, కోలాటాలతో గ్రామం హోరెత్తిపోయింది. శ్రీరామ జయరామ అంటూ అయ్యప్పల శరణుఘోషలతో వస్తున్న వారికి మహిళలు నీళ్లు అందించి మంగళహారతులు పట్టారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ గ్రామంలోని పుర వీధుల్లో నగర సంకీర్తన కొనసాగిస్తూ అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్ర ఆదాయం రూ.9.58 లక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రానికి కార్తీక మాసం రెండో సోమవారం భక్తుల ద్వారా రూ.9,58,732 ఆదాయం లభించింది. రూ.200 దర్శనం ద్వారా రూ.2,53,400, రూ.100 దర్శనం ద్వారా రూ.3,48,400, రూ.50 దర్శనం ద్వారా రూ.1,50,200, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.49,405, అన్నదానం ట్రస్టు నిమిత్తం రూ.1,57,327 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు తెలిపారు.

నేడు అక్షరాస్యతా ర్యాలీలు

భీమవరం: సర్వోదయమండలి ఆధ్వర్యంలో విద్యాదాత చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు వర్ధంతి సందర్భంగా ఈ నెల 12న అక్షరాస్యత ర్యాలీలు నిర్వహించనున్నట్లు మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూర్తిరాజు నెలకొల్పిన 68 విద్యా సంస్థల్లో అక్షరాస్యతా ర్యాలీలు, శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరంలోని కొవ్వాడ 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో 11 కెవి లైన్లు మరమ్మతుల నిమిత్తము మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండవ పట్టణములో గల శివరావుపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈ.ఈ) ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. శివరావుపేట ఏరియాకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మీకోసంకు 6 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమంకు ఆరు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. నగర పంచాయతీలోని సమస్యలతో పాటు ఇతర వ్యక్తిగత సమస్యలతో ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపినట్లు చెప్పారు.

నేడు కాళ్లలో ఐఏఎస్‌ల బృందం పర్యటన

కాళ్ల: మండలం ప్రాతాళ్ళమెరక గ్రామంలో మంగళవారం ఐఏఎస్‌ల బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జి.స్వాతి సోమవారం తెలిపారు. ముస్సోరి నుంచి విచ్చేయుచున్న ట్రైనీ ఐఏఎస్‌ల బృందం ఫీల్డ్ స్టడీ అండ్ రిసర్చ్ ప్రోగ్రామ్ ఫర్ 99వ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ప్రాతాళ్ళమెరక విచ్చేస్తున్నట్లు తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులందరూ అందుబాటులో ఉండాలని సూచించారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

నరసాపురం రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. మంగళ, బుధవారంల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సమైఖ్య లీడర్లకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా కార్తీక మాస పూజలు


ఉండి శివాలయంలో పూజలందుకుంటున్న చెన్నమల్లేశ్వరస్వామి


ఉమా సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉండి: కార్తీక మాస పూజలు మండలంలో ఘనంగా నిర్వహించారు. రెండవ సోమవారం సందర్భంగా మండల వ్యాప్తంగా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉండి రాజులపేటలో పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామునుంచే స్వామివారికి రుద్రాభిషేకం, నీరాజనం, మంత్రపుష్పాల పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, జ్యోతిర్లింగార్చన, స్వామివారికి అమ్మవారికి విశేష అలంకరణ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు చలపతిరావు, తాడేపల్లి కిరణ్‌శర్మ, ఏలూరుపార్టీ ఫణిశర్మ, మామిడన్న ప్రదీప్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసం రెండో సోమవారం పంచారామక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది.ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, చేకూరి రామకృష్ణ నిర్విరామంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

త్రినేత్రుడికి మహాభిషేకాలు


అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

ఆకివీడు: కార్తీక సోమవారం రోజు శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలోనూ, అయిభీమవరంలోని అమృత లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

పరిశోధనా కేంద్రం ప్రారంభం


ఫిజిక్స్ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిశాంత్ వర్మ

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు జేఎన్టీయూకే నూతనంగా మంజూరు చేసిన ఇంజనీరింగ్ ఫిజిక్స్ పరిశోధన కేంద్రాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశ్శాంత వర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ జేఎన్టీయూకే నిపుణుల బృందం ఇటీవల తమ కళాశాలను సందర్శించి ఇంజనీరింగ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌ను లేబరేటరీలను పరిశీలించిందన్నారు. అనంతరం ఇంజనీరింగ్ ఫిజిక్స్ పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ఎంవీ సోమేశ్వరరావు, పి.భవాని వెంకటపతిరాజు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

ఉండి: మండలం చినపుల్లేరు గ్రామ శివారు తల్లమ్మచెరువులో బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేసారు. తల్లమ్మచెరువులో బెల్టుషాపు నిర్వహిస్తున్న గొల్ల ఆశీర్వాదం అనేవ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్ఐ ఎల్.రమాదేవి తెలిపారు. సదరు వ్యక్తిపై ఆకివీడు ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.